




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :59 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు సోమవారం 4 నవంబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 59 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE MON 3 NOVEMBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోంది

- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం
- రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక అరాచకం చేస్తున్నారు : సజ్జల రామకృష్ణారెడ్డి
- 2027 లోనే జమిలి ఎన్నికలు రాబోతున్నాయి : ఎంపీ వైవీ సుబ్బారెడ్డి
- ఐక్యమే మన బలం, మన ఆయుధం: అంబటి రాంబాబు
- పవన్‌ను ప్రజలే నొక్కి తాట తీస్తారు : ఆర్కే రోజా



పెన్ పవర్ డెస్క్:చంద్రబాబు ప్రమాణ స్వీకారం మొదలైన నుంచి రాష్ట్రంలో అరాచకాలు మొదలయ్యాయి. ఒక మాఫీయ రాజ్యం ఏలుతుందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ కనిపించడం లేదు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక అరాచకం చేస్తున్నారు. పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారు. నాలుగు నెలల్లో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరిగాయి. మనం చూస్తూనే ఉన్నాం. అడ్డంగా దోచుకుని జేబులు నింపుకుంటున్నారు. వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ ఘటనపై ఏదో రాద్ధాంతం చేశారు. తిరుమల లడ్డు ప్రసాదంపై చంద్రబాబు విష ప్రచారం చేశారు. ఇవాళ చిత్తూరు, తిరుపతి జిల్లాల వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైయస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. వైయస్ఆర్‌సీపీ అధినేత, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమ కట్టడాలు చేయలేదు. కరకట్ట అక్రమ కట్టడంలో చంద్రబాబు ఉంటున్నారు. వైయస్ జగన్ కట్టించిన రుషికొండ భవనాలు చూసి చంద్రబాబు సంతోపడ్డారు. వైఎస్ జగన్ విలాసం కోసం కట్టించుకున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రుషికొండపై ఉన్న భవనం వైఎస్ జగన్‌దే అయితే ఆయనకే రాసి ఇచ్చేయండి. ఇప్పటికైనా చంద్రబాబు తప్పుడు ప్రచారాలను మానుకోవాలి. అసెంబ్లీ భవనాలు చూస్తే నీ పాలన అర్థం అవుతుంది. వైయస్ జగన్ చేసిన వేల కోట్ల సంక్షేమంతో నీవు పోల్చుకోగలవా చంద్రబాబు?. సూపర్ సిక్స్ ఎక్కడా అమలు లేదు. ఈ ఐదు నెలల్లో 53వేల కోట్లు అప్పు చేశాడు. చంద్రబాబు ప్రతీరోజు అప్పు చేస్తున్నాడు. ఈ డబ్బులన్నీ ఏమైపోతున్నాయి. వైయస్ జగన్ చేసిన అప్పులు నిర్మాణాత్మకంగా ఉన్నాయి.

**వచ్చే ఎన్నికల్లో ఎవరూ ఊహించని విజయం సాధిస్తాం : వైయస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి**

వచ్చే ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ ఎవరూ ఊహించని విధంగా విజయం సాధిస్తుందని ఎంపీ విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 2027లోనే ఎన్నికలు రాబోతున్నాయని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మం అంటే మూఢ నమ్మకం కాదు, ప్రజలకు సేవలు చేస్తూ, దళిత గోవిందం, సోషలిస్టు భావజాలం ప్రజలకు తీసుకువెళ్ళిన నాయకుడు భూమన కరుణాకరరెడ్డి. తిరుపతి నగరం గత ఐదేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల్లో ఎన్నో దారుణాలు జరిగాయి. 2027 చివరిలో మళ్ళీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విజయం సాధిస్తాం. ఆ ఎన్నికల్లో భూమన కరుణాకరరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ మాఫియా రాజ్యం నడుస్తోందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి అన్నారు. రుషికొండపై వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టించిన భవనం చూసి చంద్రబాబు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో రుషికొండపై ఉన్న భవనం వైయస్ జగన్‌దే అయితే ఆయనకే

వివరాలు 2లో..



# వక్ఫ్ సవరణ బిల్లు

## చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకుంటారన్నదానిపై సర్వత్రా ఆసక్తి

- పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ బిల్లు తీసుకురానున్న కేంద్రం
- ఆ బిల్లుకు మద్దతు ఇవ్వవద్దంటూ చంద్రబాబుకు ముస్లిం నేతల విజ్ఞప్తి
- ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ
- చంద్రబాబుకు ఇబ్బందికరంగా మారిన తాజా పరిణామాలు!

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో, ముస్లిం వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో, కేంద్రం తీసుకురానున్న వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలంటూ టీడీపీ ముస్లిం నేతలు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మహ్మద్ ఫజ్లుర్ రహీమ్ ముజాదిది నేతృత్వంలో ముస్లిం నేతలు చంద్రబాబును కలిశారు.

# కేంద్ర సహాయమంత్రి సురేశ్ గోపీపై కేసు నమోదు

- చిక్కుల్లో కేంద్ర సహాయమంత్రి
- ఓ కార్యక్రమానికి అంబులెన్స్ లో వచ్చిన సురేశ్ గోపి
- ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించారంటూ కేసు నమోదు



వివరాలు 2లో..

# వైయస్ఆర్‌సీపీ కి కార్యకర్తలే బలం

## మాజీ మంత్రి పేర్ని నాని

**అట్టహాసంగా వైయస్ఆర్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ ప్రమాణ స్వీకారం**



పెన్ పవర్ డెస్క్:'అధికారం లేకపోయినా వైయస్ ఆర్‌సీపీ జెండా మోసిన కార్యకర్తలు దర్జాగా బతుకుతుంటే.. జనసేన జెండా మోసిన కార్య కర్తలు మానసిక క్షోభను అనుభవిస్తున్నా

వివరాలు 2లో..

# యూపీ సీఎం యోగిని చంపేస్తాం..

## ముంబై పోలీసులకు బెదిరింపు కాల్



- పది రోజుల్లోగా సీఎం పదవికి రాజీనామా చేయాలని వార్నింగ్
- లేదంటే బాబా సిద్ధిఖీ తరహాలోనే ప్రాణాలు కోల్పోతాడన్న ఆగంతకుడు
- ట్రాఫిక్ పోలీసుల హెల్ప్ లైన్ సెంటర్ కు ఫోన్ కాల్

వివరాలు 2లో..

# టీబీ వ్యాధిపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన

- భారత్ అద్భుతమైన పురోగతిని సాధించిందన్న ప్రధాని
- అంకితభావం, వినూత్న పద్ధతుల్లో కృషి ఫలితంగానే సాధ్యమైందని వ్యాఖ్య
- ఉమ్మడి స్ఫూర్తితో టీబీపై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడి




పెన్ పవర్ డెస్క్:టీబీ (క్షయ) నివారణ విషయంలో అద్భుతమైన పురోగతి సాధించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. టీబీ రహిత భారతదేశాన్ని

వివరాలు 2లో..

# రాష్ట్రంలో అధికారంలో ఉన్నది అన్న కాదు... శకుని

- ఆసక్తికర ట్వీట్ చేసిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి
- జెండా కూలీల్లారా... నేనూ మీలో ఒకడ్ని అంటూ ట్వీట్
- ఎంత కొట్టుకున్నా ఉపయోగం లేదు అంటూ వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి "నా ప్రియమైన జెండా కూలీల్లారా... నేను కూడా మీలో ఒకడ్ని" అంటూ ఆసక్తికర ట్వీట్ చేశారు. "మనం ముందుగా పోరాడాల్సింది బానిసత్వం నుంచి విముక్తి కోసం... ఎందుకంటే లాభాల్లో వాటా మన కూలీలకు ఇవ్వరుగా! కూలీలకు కూలీ మాత్రమే గిడుతుంది. ఎంత కొట్టుకున్నా ఉపయోగం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది అన్న కాదు.... శకుని. వైసీపీ, జగన్ గారు అధికారంలోకి వస్తే,

వివరాలు 2లో..

# వక్ఫ్ భూములు ఆక్రమించి ఇల్లు కట్టారు..

## ముఖేష్ అంబానీపై అసదుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:బిలియనీర్, ప్రముఖ వ్యాపార వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిలో ముఖేష్ అంబానీ నివాసం యాంటిలియా ను నిర్మించారని ఆరోపించారు. ఓ ఇంట ర్వ్యూలో అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2024పై తన అభిప్రాయాలు చెప్పారు. సంస్కరణల పేరుతో వక్ఫ్ బోర్డులను అంతం

వివరాలు 2లో..

# పిఠాపురంలో పవన్ పర్యటన...

- సొంత నియోజకవర్గంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- అధికారులతో సమీక్ష, జనసేన నాయకులతో సమావేశం
- సోమవారం రాత్రి చేబ్రోలులోని తన నివాసంలో బస



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమ, మంగళ వారాల్లో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 4వ తేదీ ఉదయం 11:30 గంటలకు రాజమండ్రి ఎయిర్ పోర్ట్ లో విమానం దిగనున్న పవన్ కల్యాణ్.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గొల్లప్రోలు జిల్లా పరిషత్ స్కూలుకు చేరుకుంటారు. స్కూలులో సైన్స్ ల్యాబ్ ప్రారంభించి గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ, సూరంపేట హ్యాబిటేషన్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

వివరాలు 2లో..

# 'ఒక్క రన్ కూడా తీయలేదు.. ఇంకెప్పుడు సిక్స్ కొడతావ్ బాబూ?'



పెన్ పవర్ డెస్క్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని.. సూపర్ సిక్స్ హామీల అమలు సంగతి మర్చిపోయారంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు.

వివరాలు 2లో..

# ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

- ప్రజల్లో వ్యతిరేకత ఉందనే స్థానిక ఎన్నికలు నిర్వహించడంలేదన్న అర్వింద్
- వెంటనే తెలంగాణలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- గత ఎన్నికల ప్రచారంలో హామీలపై ఖర్గే కూడా మాట్లాడారని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత ఉందన్న కారణంగానే స్థానిక ఎన్నికలు నిర్వహించడంలేదని అన్నారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని అర్వింద్ డిమాండ్ చేశారు. గత ఎన్నికల ప్రచారంలో హామీలపై ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా మాట్లాడారని, అధికారంలో ఉండగా ఏంచేశారని పాదయాత్రలు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కెనడా పొగరుకు పెద్ద మందు వేయాల్సిందే

తమ దేశ భద్రతకు.. సార్వభౌమాధికారానికి.. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లితే ఎదుటోడు ఎవడన్న విషయాన్ని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారి విషయంలో ఒక్క అమెరికానే కాదు.. ప్రపంచంలోని చాలా దేశాలు అస్సలు ఉపేక్షించవు. చివరకు చిన్న దేశాలు సైతం ఎగిరెగిరి పడుతుంటాయి. ఇలాంటప్పుడు ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ మరింత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం ఉంది కదా? అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న ధోరణి సరికాదన్న భావన వ్యక్తమవుతోంది.

తప్పు చేయకున్నా.. తప్పు చేసినట్లుగా బిల్డప్ లు ఉన్న కెనడాకు ముకుతాడు వేయాల్సిన అవసరం ఉంది. అసలు బారత్ ను ముక్కలు చేయాలన్న నినాదంతో ఉండే సంస్థల విషయంలో కెనడా ఎందుకు చర్యలు తీసుకోదు? ఇలాంటి తీరును ముందు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. భారత సార్వభౌమాధికారానికి సవాలుగా మారుతున్న ఇలాంటి శక్తుల విషయంలో దూకుడుగా ఎందుకు వ్యవహరించకూడదు?ఇప్పటికే ఖలిస్థానీ సానుభూతిపరులకు పెద్దపీట వేస్తున్న కెనడా తీరును అంతర్జాతీయంగా ఎందుకు ప్రశ్నించకూడదు. ఇలాంటి శక్తులను ఎందుకు ఆదరించాలి? భారత్ పాత్ర లేకున్నా ఖలిస్థానీ నేత నిజ్జర్ ను ఎవరో హత్య చేస్తే దానని భారత్ ఖాతాలో వేయటం.. దౌత్య సిబ్బందిపై నేరారోపణ చేయటం.. వారిపై చర్యలు తీసుకునే షాకింగ్ చర్యలకు తెర తీయటం లాంటి పనులు చేపట్టిన కెనడా.. ఇటీవల దేశ హోం మంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేయటం తెలిసిందే.కెనడా మంత్రి ఒకరు కేంద్ర మంత్రి అమిత్ షాపై అసంబద్ధ ఆరోపణలు చేసిన నేపథ్యంలో దానిని భారత్ తీవ్రంగా ఖండించటమే కాదు.. కెనడా హైకమిషనర్ ప్రతినిధిని పిలిపించి తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. కెనడా అధికారికి సమన్లు జారీ చేశారు. అయితే.. ఈ చర్యలు కెనడా లాంటి మొద్దు శరీరం ఉన్న ట్రూడో ప్రభుత్వాన్ని కదిలిస్తుందా? అన్నది ప్రశ్న. ఒక ప్రజాస్వామ్య దేశానికి చెందిన హోం మంత్రి మీద తీవ్ర ఆరోపణలు చేసే వేళ.. ఆధారాల్లేకుండా మాట్లాడటానికి మించిన దుర్మార్గం ఏముంటుంది? ఇప్పటికే పలుమార్లు లక్ష్మణ రేఖ దాటుతున్న కెనడాకు ముకుతాడు వేయాల్సింది. గతంలో మాదిరి కాదని.. ఏమన్నా చూస్తూ ఊరుకునే ధోరణి భారత్ కు లేదన్న విషయంతో పాటు.. దేశ ప్రయోజనాల్ని దెబ్బ తీసే ఎలాంటి చర్యలకైనా ఖరీదైన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్న విషయాన్ని కెనడాకుఅర్థమయ్యేలా చెప్పటం చాలా అవసరమని చెప్పాలి. మరి.. మోడీ సర్కారు ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

# రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోంది

రాసి ఇచ్చేయండి అని కామెంట్స్ చేశారు.

**రాబోయే రోజుల్లో అన్ని స్థానాలు గెలిచి తీరుతాం : ఎంపీ వైవీ సుబ్బారెడ్డి**

- వైయస్ జగన్ ఎన్నో అభివృద్ధి చారిత్రాత్మక కార్యక్రమాలు చేశారు
- ఈరోజు ప్రజలు కు సంక్షేమం దూరం అయింది
- సిక్స్ ప్యాక్ హామీలు అని చెప్పి మోసం చేశారు చంద్రబాబు
- డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు చంద్రబాబు
- దేవుడును కూడా చంద్రబాబు రాజకీయాలకు వాడుకున్నారో చూశాం
- విశాఖకు వెళ్ళి ఋషి కొండ నిర్మాణలు చూస్తున్నారు
- సంపద సృష్టిస్తున్నాం అంటూనే..
- 16 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంపద సృష్టిస్తే , ప్రవేట్ పరం చేస్తున్నారు చంద్రబాబు
- రాష్ట్ర వ్యాప్తంగా 4 పోర్టులు నిర్మాణము చేస్తే చంద్రబాబు ప్రైవేట్ పరం చేస్తున్నారు
- రాబోయే రోజుల్లో కార్యకర్తలు మరింత గుర్తింపు ఇస్తాం
- 2027 లోనే జమిలి ఎన్నికలు రాబోతున్నాయి
- మళ్ళీ వైయస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేద్దాం.
- తిరుపతి నగరం ఎంతో అభివృద్ధి చేసిన ఘనత భూమన దే
- దివంగత నేత వైయస్ఆర్‌తో పాదయాత్రలో పాలు పంచుకున్న నేతలు ఈ స్టేజిపై భూమన కరుణాకరరెడ్డి, అంబటి రాంబాబు
- భూమన కరుణాకరరెడ్డి జీవితం అంతా వైయస్ఆర్ కుటుంబం తోనే..
- ఆయనలో ఉన్న నాయకత్వ పటిమ రాబోయే...రోజుల్లో అన్ని స్థానాలు గెలిచి తీరుతాం

**ఐక్యమే మన బలం, మన ఆయుధం: అంబటి రాంబాబు**

- భూమన కరుణాకరరెడ్డి అద్భుత పుస్తక పఠన శక్తి ఉన్న నాయకుడు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా లో అన్ని స్థానాలు గెలుపుకు కృషి చేస్తారు
- దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు ఇచ్చారు జగన్ మోహన్ రెడ్డి
- ప్రజాస్వామ్య దేశం లో గెలుపు ఓటములు సహజం
- ఐక్యమే మన బలం, మన ఆయుధం
- ప్రభుత్వ వ్యతిరేకత శరవేగంగా పెరుగుతుంది
- మద్యం దుకాణాలు తెరవక ముందే టిడిపి నేతలు దుకాణాలు తెరిచారు
- వీటి అన్నింటినీ ప్రజలు దృష్టికి తీసుకువెళ్లాలి.. ప్రజలు బంగారు పళ్ళెంలో పెట్టి మనకు అధికారం ఇస్తారు
- పవన్ కళ్యాణ్ మహిళలకు అన్యాయం జరిగితే సంహించను చెప్పిన వ్యక్తి ఈరోజు ఎక్కడ
- రోజుకో హత్య , అత్యాచారం జరుగుతోంది
- చంద్రబాబు పాలనలో ఏమి జరిగినా ప్రశ్నించరా.. మీ నోటికి ప్లాస్టర్ తీయండి
- మీ బాధ్యత గుర్తు చేస్తున్నాం
- సీపీఐ, సీపీఎంతో పవన్ పొత్తు పెడితే చేగువేరా గుర్తుకు వస్తాది
- బిజెపితో పొత్తు లో భాగంగా సనాతన ధర్మం గుర్తుకు వస్తుంది
- చంద్రబాబు ఋషి కొండ భవనాలు చూసి ఆశ్చర్య పోతున్నదు
- చంద్రబాబు ఈ భవనాలు చూసి సిగ్గు పడాలి
- జగన్ మోహన్ రెడ్డి ఈరోజు కాలర్ ఎగరేసుకుని చెప్పండి రుషికొండ అద్భుత భవనాలు కట్టాడు అని చెప్పండి
- ఋషి కొండ లో ప్రభుత్వ భవనాలు కడితే విలాస భవనాలు అంటూ చంద్రబాబు విష ప్రచారం చేశారు
- శర వేగంగా ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది
- రెడ్ బుక్ కు మా కుక్క కూడా భయ పడదు యువతరం ఈరోజు ముందుకు వచ్చింది
- చంద్రబాబు సొంత జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అన్ని స్థానాలు గెలుస్తుంది

**◆ EVM ప్రొడక్షన్ వారి CBN ప్రభుత్వం: ఆర్కే రోజా**

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన ఉచితంలో ఉచితం లేదని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి ఆర్కే రోజా. చంద్రబాబు పాలనలో పవన్ కల్యాణ్ నోటికి ప్లాస్టర్ వేసుకున్నాడా?. ప్రశ్నిస్తాను అంటూ బిల్డప్ ఇచ్చిన పవన్ ఇప్పుడు ఏమైపోయాడని ప్రశ్నించారు. తొక్కి నారతీస్తామని చెప్పిన పవన్‌కు ప్రజలే నొక్కి తాట తీస్తారని వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ.. చంద్రబాబు ఈ జిల్లా వ్యక్తి అని చెప్పుకోడానికి సిగ్గు పడుతున్నాం. సూపర్ సిక్స్ కాదు, సూపర్ చీటింగ్ చేస్తున్నాడు. వైయస్ జగన్‌మోహన్ రెడ్డికి మనం అండగా నిలవాలి. కూటమి ప్రభుత్వం మెడలు వంచాలి. తప్పుడు ప్రచారం వల్ల మనం ఓడిపోయాం. సూపర్ సిక్స్ అమలు కావడం లేదు. సంక్షేమ పథకాలు లేవు చంద్రబాబు చెప్పిన ఉచితంలో ఉచితం లేదు. సినిమా ఇండస్ట్రీలో ఏవీఎం బ్యానర్‌లో ఎన్నో పెద్ద పెద్ద హిట్ సినిమాలు తీశారు. రాష్ట్రంలో ఈవీఎం ప్రొడక్షన్ వారి సీబీఎన్ ప్రభుత్వం కొనసాగుతోంది. సూటిగా ప్రశ్నిస్తున్న.. రెడ్ బుక్ అంటూ మీ కొడుకు ఏవిధంగా వేధిస్తున్నాడో చూస్తున్నాం. చంద్రబాబు పాలనలో నోటికి ప్లాస్టర్ వేసుకున్నాడు డిప్యూటీ సీఎం పవన్. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. విజయవాడ నగరం నీట ముంచేశారు. పులిహోర పొట్లాలకు 360 కోట్లు ఖర్చు చేశారు. దాని పేరుతో డబ్బులు దోచుకున్నారు. ప్రశ్నించే పార్టీ అని చెప్పిన పవన్ ఇప్పుడేం చేస్తున్నాడు. ఎక్కడ ఉన్నాడు?. దారుణాలపై ఎందుకు ప్రశ్నించలేకపోతున్నాడు. తొక్కి నారతీస్తామన్న పవన్‌ను ప్రజలే నొక్కి తాట తీస్తారు. ఈ రాక్షస పాలన అంతం చేయాలి. ఈరోజు నుంచి రెట్టించిన ఉత్సాహంతో దూసుకువెళ్దాం. మన జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి కృషి చేయాలి. కుల మతాలకు అతీతంగా వైయస్ జగన్ కృషి చేశారు.

# వక్ఫ్ భూములు ఆక్రమించి ఇల్లు కట్టారు..

- మొదటి పేజీ తరువాయి

చేయాలని చూస్తున్నారని ప్రధాని మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. సంస్కరణ బిల్లు ఓ నిబంధన ద్వారా వక్ఫ్ భూమిని బోర్డునుంచి లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు.

వక్ఫ్ ఆస్తుల పేరుతో ముస్లిం కమ్యూనిటీ భూములను ఆక్రమిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై ఎంఐఎం చీఫ్ స్పందిస్తూ.. అది బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ చేస్తు ప్రచారమని అన్నారు.

**ఆంటిలియాపై అసదుద్దీన్ ఒవైసీ..**

రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తన నివాసం అయిన ఆంటిలియాను వక్ఫ్ బోర్డు భూముల్లో నిర్మించారని అసుదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోందన్నారు. ముఖేష్ అంబాని ఇల్లు ఆంటిలియా వక్ఫ్ ఆస్తి అని అన్నారు.

**వక్ఫ్ చట్ట సవరణ బిల్లు..**

ఇటీవల బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం వక్ఫ్ చట్టసవరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం లక్ష్యంగా ఈ బిల్లును తెచ్చారు. రిజిష్ట్రేషన్ ప్రక్రియ, వక్ఫ్ స్థలాల సర్వే చేయడం, ఆక్రమణలను గుర్తించి అడ్డుకోవడం. అయితే వక్ఫ్ బోర్డుల అధికారాలు పరిమితం చేయడమే లక్ష్యంగా చట్టసవరణకు చేస్తోందని ముస్లిం నేతలు వాదన.

వక్ఫ్-అలాల్-ఔలాద్ పరిస్థితుల్లో ముస్లిం మహిళలకు వారసత్వ హక్కులను పొందడం ఈ సవరణ లక్ష్యం.

'వినియోగదారు ద్వారా వక్ఫ్'కు సంబంధించిన సెక్షన్లను తొలగించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.

ఆస్తులను వక్ఫ్ లేదా ప్రభుత్వ నియంత్రణలో వర్గీకరించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఇవ్వబడింది.

ఆస్తి వర్గీకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్ నిర్ణయమే అంతిమంగా పరిగణించబడుతుంది.

ఈ వర్గీకరణలకు సంబంధించిన వివాదాలను తగిన హైకోర్టులు పరిష్కరించగలవు.

**బిల్లుపై వివాదం**

వక్ఫ్ చట్టం సవరణ బిల్లు ప్రస్తుతం భారతదేశంలో చర్చలో ఉంది, భారత పార్టీ నుండి గణనీయమైన వ్యతిరేకత ఉంది.

బిల్లు కారణంగా ముస్లిం వర్గాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్న భూ కబ్జా గురించి ఆందోళనలు తలెత్తాయి.

అదే ముస్లిం వర్గాల దీర్ఘకాల అభ్యర్థనను బిల్లు పరిష్కరిస్తున్నట్లు అధికార ఎన్‌డిఎ వాదిస్తోంది.

బిల్లు ప్రస్తుతం జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఫలితాలు డిసెంబర్‌లో వెల్లడి కానున్నాయి.

# రాష్ట్రంలో అధికారంలో ఉన్నది అన్న కాదు... శకుని

- మొదటి పేజీ తరువాయి

ఆయన ఆశీస్సులతో నేను కేంద్రంలో మంత్రినయితే... చట్ట సవరణ చేసి కార్మికులను, కూలీలను లాభాల్లో భాగస్వాములను చేస్తాం. లాభాల్లో 10 శాతం వాటా ఇవ్వడమే కాకుండా, దాన్ని తప్పనిసరి చేస్తూ, దానిపై పన్ను కూడా మినహాయింపు చేస్తాం" అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

- మొదటి పేజీ తరువాయి

అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇక, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు కాంగ్రెస్ ను బెదిరించేలా ఉన్నాయని అన్నారు.

# యూపీ సీఎం యోగిని చంపేస్తాం..

**పెన్ పవర్ డెస్క్:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తి ఒకరు ముంబై పోలీసులకు ఫోన్ చేశాడు. పది రోజుల్లోగా యోగి తన పదవికి రాజీనామా చేయాలని హెచ్చరించాడు. లేదంటే బాబా సిద్ధిఖీ లాగా యోగి ఆదిత్యనాథ్ కూడా చనిపోతాడని బెదిరించాడు. ఈమేరకు ముంబై ట్రాఫిక్ పోలీసుల హెల్ప్ లైన్ సెంటర్ కు శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సదరు ఫోన్ కాల్ ఎవరు చేశారు.. ఎక్కడి నుంచి చేశారనే వివరాలు ఆరా తీస్తున్నారు. బెదిరింపులకు పాల్పడ్డ ఆగంతకుడిని పట్టుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ (అజిత్ వర్గం) నేత బాబా సిద్ధిఖీ గత నెలలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. బాంద్రాలో కుమారుడు, ఎమ్మెల్యే జీశాన్ సిద్దిఖీ ఆఫీసు ముందు బాబా సిద్దిఖీపై దుండగులు కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలతో కుప్పకూలిన సిద్దిఖీ.. ఆసుపత్రికి తరలించేలోపే చనిపోయారు. ఈ హత్యకు పదిహేను రోజుల ముందు సిద్దిఖీకి బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. కాగా, సల్మాన్ ఖాన్ కు ఆత్మీయుడు కావడం వల్లే బాబా సిద్దిఖీని హత్య చేశామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది. సల్మాన్ ఖాన్ ను కూడా తుదముట్టిస్తామని బెదిరించింది. బాబా సిద్దిఖీ కుమారుడు జీశాన్ సిద్దిఖీకి కూడా బెదిరింపులు వచ్చాయి. తాజాగా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను చంపేస్తామంటూ ఫోన్ కాల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

# పిఠాపురంలో పవన్ పర్యటన...

- మొదటి పేజీ తరువాయి

చేస్తారు. నియోజకవర్గం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష జరపనున్నారు. అనంతరం జనసేన నేతలతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు చేబ్రోలులోని తన నివాసంలో పవన్ విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం పిఠాపురంలో ఆర్ఆర్ బీహెచ్ఆర్ డిగ్రీ కాలేజీ, బాదం మాధవ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రారంభోత్సవం, టీటీడీ కళ్యాణ మండపం, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మరమ్మతు పనులకు ఉపముఖ్యమంత్రి పవన్ శంకుస్థాపన చేస్తారు. సోమవారం రాత్రి చేబ్రోలులో బసచేస్తారు. మంగళవారం ఉదయం కొత్తపల్లి పీహెచ్ సీలోని ఔట్ పేషెంట్ విభాగానికి, యు.కొత్తపల్లి మండలంలోని పలు పాఠశాలలకు పవన్ కల్యాణ్ శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 1 గంటకు తిరిగి చేబ్రోలుకు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు రోడ్డు మార్గంలో రాజ మండ్రి ఎయిర్ పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో విజయవాడకు వెళ్తారు.

# కేంద్ర సహాయమంత్రి సురేశ్ గోపీపై కేసు నమోదు

**పెన్ పవర్ డెస్క్:** కేంద్ర సహాయమంత్రి, మలయాళ సూపర్ స్టార్ సురేశ్ గోపీపై కేరళ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ తో పాటు, త్రిస్సూర్ పురం సంబరాలకు హాజరయ్యేందుకు వెళుతూ అంబులెన్స్ ను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న త్రిస్సూర్ పురంలోని స్వరాజ్ మైదానానికి ఆయన అంబులెన్స్ లో వచ్చారు. ఈ క్రమంలో ఆయన వన్ వే రోడ్డులో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి. అది కూడా రోగులను తరలించే అంబులెన్స్ లో రావడం వివాదాస్పదమైంది. అయితే, తాను అనారోగ్య కారణాల వల్లే ఇలా అంబులెన్స్ లో రావాల్సి వచ్చిందని సురేశ్ గోపీ అప్పట్లో వివరణ ఇచ్చారు. కాలు నొప్పితో జనాల్లో నడవలేనని, ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేని కొందరు యువజనులు తనకు అంబులెన్స్ ను సమకూర్చారని ఆయన వివరణ ఇచ్చారు. కాగా, ఓ కమ్యూనిస్ట్ నేత ఫిర్యాదు మేరకు సురేశ్ గోపీపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆయనపై ఐపీసీ 279, 34 సెక్షన్లు, మోటారు వాహనాల చట్టం కింద 179, 184, 188, 192 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మలయాళ చిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్ గా ప్రఖ్యాతిపొందిన సురేశ్ గోపీ రాజకీయాల్లోకి ప్రవేశించడమే కాదు, ఎంపీగా గెలుపొంది కేంద్ర మంత్రివర్గంలోనూ చోటు సంపాదించారు. కేరళలో బీజేపీ తరఫున లోక్ సభకు ఎన్నికైన తొలి ఎంపీగా సురేశ్ గోపీ చరిత్ర సృష్టించారు. ఆయనను కేంద్ర మంత్రివర్గంలో పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయంత్రిగా నియమించారు.

# వైయస్ఆర్‌సీపీ కి కార్యకర్తలే బలం

- మొదటి పేజీ తరువాయి

రు. కొడుతున్నారు. కాళ్లు పట్టిస్తున్నారు. నువ్వేం చేస్తున్నావ్ పవన్' అంటూ మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నలు సంధించారు. ఇవాళ వైయస్ఆర్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పేర్ని నాని పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ..చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ప్రజలకు అబద్దాలు చెప్పి అధికారం లోకి వచ్చారు.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను వేధిస్తున్నారు

ఈరోజు వేధించే వాళ్ళకి 10 రేట్లు మేము తిరిగి ఇస్తాం

నాలుగేళ్లకంటే ముందే...వాళ్ళకి చూపిస్తాం

అధికార మదంతో కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు

ఎంత కొట్టినా, తిట్టినా వైయస్ఆర్‌సీపీ జెండా మోయకుండా ఎవ్వరు ఆపలేరు

అది మా పార్టీ కార్యకర్తల చిత్తశుద్ధి

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే..అరెస్టులు చేస్తున్నారు

వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు భయపడదిలేదు

టీడీపీ సోషల్ మీడియాలా డబ్బులకు పని చేసేవాళ్ళు కాదు

వైయస్ జగన్ తల్లి, చెల్లెలి గురించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారు

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మీరు తల్లికి, చెల్లికి ఆస్తులు రాసిచ్చారా

చంద్రబాబుకి ఎంత మంది చెల్లెలు ఉన్నారో ఎవరికైనా తెలుసా

తన చెల్లెళ్లకు చంద్రబాబు ఎంత ఆస్తి రాసిచ్చారు

వైయస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చూసి ఎవరు ప్రేమించరు

వైయస్ జగన్‌ని ఓ హీరోగా, ఆదర్శ రాజకీయ నాయకుడిగా ప్రేమిస్తారు

సీట్లు చూసుకుని నోరు లేచేది పవన్ కళ్యాణ్ బ్యాచ్

మాకు ఎన్ని సీట్లు, ఉన్నా లేకపోయినా మేం పోరాడుతాం

మాకు అధికారం ఉన్నా, లేకపోయినా నోరు లేస్తుంది

వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు నోరు లేపితే తాట తీస్తాడంట

నిన్ను నమ్ముకుని నీ జెండాలు మోసిన జనసేన కార్యకర్తల్ని కొడుతుంటే నువ్వేం చేశావ్ పవన్

జనసేన కార్యకర్తల్ని టీడీపీ వాళ్ళు కొడుతుంటే..ఏం చేశావ్?

అధికారం లేకపోయినా వైయస్ఆర్‌సీపీ జెండా మోసిన కార్యకర్తలు దమ్ముగా బతుకుతున్నారు

పవన్ జెండా మోసిన..వాళ్ళు మాత్రం మానసికంగా క్షోభ అనుభవిస్తున్నారు

కొడుతున్నారు..కాళ్ళు పట్టిస్తున్నారు..ఎం చేస్తున్నావ్

పవన్ కళ్యాణ్ మా సంగతి తర్వాత. నిన్ను నమ్మినోళ్ళ సంగతి ముందు చూస్కో

మమ్మల్ని ఎంత వేధించినా ..మేము తగ్గేదే లేదు..నీకు చేతనైంది చేస్కో

లోకేష్‌కి అమెరికా వెళ్లినా వైఎస్సార్‌సీపీనే గుర్తొస్తుంది

ఎన్ని కేసులు పెట్టినా.. వైయస్ఆర్‌సీపీ జెండాని వదిలి పెట్టరు

# వక్ఫ్ సవరణ బిల్లు చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకుంటారన్నదానిపై సర్వత్రా ఆసక్తి

- మొదటి పేజీ తరువాయి

వక్ఫ్ సవరణ బిల్లు-2024కి మద్దతు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. మరి, సొంత పార్టీకి చెందిన ముస్లిం నేతల విజ్ఞప్తి పట్ల చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయేకి భాగస్వామ్యపక్షంగా టీడీపీ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించడమేంటే ఎన్డీయేను వ్యతిరేకించడమే అవుతుంది. ఇదిలా ఉంటే... లోక్ సభలో ఈ బిల్లు ఆమోదం పొందాలంటే టీడీపీ మద్దతు ఎంతో అవసరం. టీడీపీకి 16 మంది ఎంపీల బలం ఉంది. మరోవైపు పార్టీ ప్రయోజనాలు, రాష్ట్రంలో ముస్లింల మద్దతు... ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని చూస్తే వక్ఫ్ సవరణ బిల్లు చంద్రబాబుకు ఇబ్బందికరంగా మారనుంది. చంద్రబాబును కలిసిన టీడీపీ ముస్లిం నేతలు, ఈ వక్ఫ్ సవరణ బిల్లు-2024 ముస్లిం సమాజానికి హానికరం అని పేర్కొన్నారు. అక్టోబరు 23న చంద్రబాబును కలిసిన వారిలో రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ కూడా ఉన్నారు. ఈ వక్ఫ్ సవరణ బిల్లు తప్పుడు ప్రయోజనాలతో కూడుకున్నదని వారు చంద్రబాబుకు వివరించారు.

ముస్లిం నేతల విజ్ఞప్తి పట్ల చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమిలోని ఇతర భాగస్వాములతో చర్చించి ఓ నిర్ణయానికి వస్తామని తెలిపారు. కాగా, ముస్లిం నేతలు చంద్రబాబును కలిసిన అనంతరం కీలక పరిణామం చోటుచేసుకుంది. టీడీపీ అధినాయకత్వం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్ బాబును ఢిల్లీ పంపించింది. ఢిల్లీలో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ముస్లిం సంఘాల నేతలను కలిసి, వక్ఫ్ సవరణ బిల్లు పట్ల ఉన్న అభ్యంతరాలపై చర్చించాలని అమీర్ బాబుకు సూచించింది.

# టీబీ వ్యాధిపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి


ఆవిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని ఆయన వెల్లడించారు. అంకితభావం, వినూత్న రీతిలో ప్రయత్నాల ఫలితంగానే దేశంలో టీబీ తగ్గుదలకు కారణమని అన్నారు. ఇకపై కూడా 'ఉమ్మడి స్ఫూర్తి'తో టీబీ రహిత భారత్ కోసం పోరాడతామని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ స్పందించారు.టీబీ నివారణలో భారత్ సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టుపై ప్రధాని మోదీ ఈ మేరకు స్పందించారు. కాగా దేశంలో 2015 నుంచి 2023 మధ్య కాలంలో టీబీ వ్యాప్తి రేటు 17.7 శాతం మేర తగ్గిందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటు 8.3 శాతం ఉండగా భారత్‌లో రెట్టింపు ఫలితం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తమ ప్రభుత్వం 'ని-క్షయ్ పోషణ్ యోజన' వంటి కీలకమైన కార్యక్రమాలను చేపడుతోందని, తద్వారా జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని విస్తరించిందని నడ్డా ప్రస్తావించారు. ఇక మల్టీ-డ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్ క్యులోసిస్ చికిత్స కోసం కొత్తగా 'బీపీఏఎల్ఎం డ్రగ్ కోర్స్' ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. క్షయవ్యాధిపై జరుగుతున్న పోరాటంలో నిబద్ధతతో కీలక పాత్ర పోషిస్తున్న ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోగ్య కార్యకర్తల అవిశ్రాంత ప్రయత్నాలను తాను గుర్తిస్తున్నట్టు నడ్డా చెప్పారు.

# 'ఒక్క రన్ కూడా తీయలేదు.. ఇంకెప్పుడు సిక్స్ కొడతావ్ బాబూ?'

- మొదటి పేజీ తరువాయి

ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు నిర్మించిన బిల్డింగ్‌లు వరదలకు గురయ్యాయి. మా హయాంలో అద్భుత భవనాలు నిర్మిస్తే ఓర్చుకోలేకపోతున్నారన్నారు"రాష్ట్రంలో రుషికొండ టూరిజం ప్రాజెక్టు లాంటి నిర్మాణాలు ఎక్కడా లేవు. రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి అద్భుత భవనాలు లేవు. నిన్న చంద్రబాబు షెడ్యూల్‌లో కూడా ఏపీ టూరిజం బిల్డింగ్ అని షెడ్యూల్ విడుదల చేశారు. చంద్రబాబు జీవితంలో ఎప్పుడైనా రుషికొండ టూరిజం భవనాలు లాంటివి నిర్మించారా?" అంటూ అమర్‌నాథ్ ప్రశ్నించారు."రూ.15 వందల కోట్లు పెట్టి చంద్రబాబు తాత్కాలిక సచివాలయం కట్టారు. వర్షం వస్తే మంత్రుల పేషిల్లోకి వరద నీరు వస్తుంది. తాత్కాలిక సచివాలయం పేరుతో పెద్ద ఎత్తున దోచేశారు. రుషికొండ నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు.. రుషికొండ టూరిజం భవనాలను మేమే ప్రారంభించాం" అని గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు."స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం చంద్రబాబు ప్రకటన చేస్తారని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశించారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ప్రభుత్వ అసమర్థతను పక్కదారి పట్టించే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారు" అని అమర్‌నాథ్ ధ్వజమెత్తారు."ప్రజలకు రుషికొండ భవనాలు చూపిస్తామని చంద్రబాబు అంటున్నారు. అమరావతి తాత్కాలిక సచివాలయం కూడా చూపిస్తే ఎవరి నిర్మాణాలు గొప్పవో ప్రజలే నిర్ణయిస్తారు. ప్రభుత్వానికి అమరావతి తప్పితే వేరే ప్రాంతం అవసరం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత విశాఖే పెద్ద నగరం. అందుకే విశాఖను రాజధాని చేయాలనుకున్నాం. విశాఖ గ్రోత్ ఇంజెన్‌గా ఉపయోగపడుతుంది. రాష్ట్రపతి, ప్రధాని వంటి పెద్దలు వచ్చినప్పుడు ఈ భవనాలు ఉపయోగపడతాయి." అని అమర్‌నాథ్ వివరించారు.

# మూడేళ్ళలో జగన్ కి రాజయోగం...ఈ జోస్యం ఎవరిది ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రస్తుతం రాజకీయంగా అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆయన పార్టీ స్తబ్దుగా ఉంది. ఆయన పార్టీ ఆ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని మూటకట్టుకుంది. దాంతో పాటుగా 11 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ క్రమంలో ప్రతిపక్ష హోదా కూడా దక్కని విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు జగన్ కి మరో నాలుగున్నరేళ్ల పాటు ఇలాంటి ఇబ్బందులే ఉంటాయని అంటున్నారు. ఎందుకంటే ప్రతిపక్షంలో ఆయన భారంగా నెట్టుకుని రావాల్సి ఉంటుంది. అయితే వైఎస్ జగన్ రాజకీయ జాతకం మారుతుందని వైసీపీ కీలక నేతలు గాఢంగా నమ్ముతున్నారు. ఆయన తిరిగి ఏపీకి సీఎం అవుతారు అని అంటున్నారు. ఆ మంచి రోజు దగ్గర కాలంలోనే ఉంది అని అంటున్నారు. మరో మూడేళ్లలో అంటే 2027 చివరలో దేశమంతా జమిలి ఎన్నికలు జరుగాయని అపుడు ఏపీలో వైసీపీ బ్రహ్మాండమైన ఆధిక్యతతో అధికారాన్ని సొంతం చేసుకుంటుంది అని వైసీపీ నేతలు చెబుతున్నారు. అంటే జగన్ కి రాజయోగం ఉందని వైసీపీ నేతలు అంతా కలసి జోస్యం చెబుతున్నారు అన్న మాట. చిత్తూరు తిరుపతి జిల్లాల వైసీపీ ఇంచార్జిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన వారంతా వైసీపీ అధికారంలోకి తప్పకుండా వస్తుందని ధీమాగా చెప్పుకొచ్చారు. గట్టిగా మూడేళ్ళు కూడా లేదు. మళ్లీ మనమే రాబోతున్నామని వారు బల్ల గుద్ది మరీ చెబుతున్నారు. విజయసాయిరెడ్డి అయితే ఈసారి అద్భుతమైన విజయం వైసీపీ సొంతం చేసుకోబోతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఎన్నో చేసిందని ఆయన గుర్తు చేశారు. అయితే కూటమి నేతలు వైసీపీ ప్రభుత్వం మీద విష ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. మరో కీలక నేత వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్ ప్రజలకు ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలు చేశారు అని గుర్తు చేశారు. ఇపుడు ఏపీలో సంక్షేమం లేదు ఏదీ లేదని కూటమి సర్కార్ ని నిందించారు. విశాఖలోని రుషికొండ నిర్మాణాలను చంద్రబాబు స్వయంగా వెళ్ళి చూసి వచ్చారని అన్నారు. అదే విధంగా వైసీపీ హయాంలో ఏపీలో నాలుగు పోర్టులను తమ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. వాటిని ఇపుడు టీడీపీ కూటమి ప్రైవేట్ పరం చేస్తోందని అన్నారు. ఏపీలో అభివృద్ధి లేకపోగా డైవర్షన్ పాలిటిక్స్ కి తెర తీస్తున్నారు అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలు జరిగితే ప్రజలు వైసీపీనే కోరుకుంటారని అంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 సీట్లకు 14 వైసీపీ ఈసారి గెలుచుకోవడం ఖాయమని అన్నారు.

ఇదిలా ఉంటే వైసీపీ నేతలు కొన్ని విషయాలను అంగీకరించడం విశేషం. తమ ప్రభుత్వ హయాంలో కొన్ని వర్గాలు దూరం అయ్యాయని ఇపుడు అందరికీ కలుపుకుని పోయే ప్రయత్నం జరుగుతోందని వారు చెబుతున్నారు. మొత్తానికి అయిదేళ్ళు అంటే భారంగా అనిపించిన వైసీపీ నేతలకు ఇపుడు మూడేళ్ళు ఆగండి అని ఆ పార్టీ పెద్ద నాయకులు చెబుతున్నారు. ఉందిలే మంచి కాలం అంటున్నారు. జగన్ సీఎం అవుతారని కూడా భరోసా ఇస్తున్నారు. జమిలి వచ్చేది జగన్ కోసమేనా. ఏమో చూడాల్సి ఉంది.

# రేవంత్ కూడా కేసీఆర్ బాటలోనే.. కుల గణన కుంపట్లు!



**హైదరాబాద్ పెన్ పవర్:** పరిపాలన నిర్ణయాలను రాజకీయాలు ప్రభావితం చేయడం అనే దశ ఎప్పుడో దాటిపోయి...రాజకీయమే పరిపాలనను నిర్ణయించే స్థాయికి చేరింది అనేది ప్రస్తుతం తప్పకుండా అంగీకరించాల్సిన బాధాకరమైన పరిస్థితి. అయితే, నాయకులు తమ రాజకీయ లెక్కల మాటున కొద్దోగొప్పో ప్రజా సంక్షేమ నిర్ణయాలు తీసుకుంటారనేది కూడా కాదనలేని వాస్తవం. ఇలాంటి పరిస్థితుల మధ్య తాజాగా తెలంగాణ కుల, ఆర్థిక, సామాజిక గణన అంశం చర్చనీయాంశంగా మారింది. మొత్తం 75 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్ లో సమగ్ర సమాచారాన్ని నమోదు చేసేందుకు నవంబర్ 6 నుంచి 20 రోజులపాటు అధికారులు సర్వే చేపట్టనున్నారు. అయితే, దీనిపై ఇప్పుడు దీనిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం లెక్క తేల్చేందుకు తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కులం, మతం, ఆస్తి, అప్పులకు సంబంధించి 75 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్ లో సమగ్ర సమాచారాన్ని స్వీకరించనున్నారు. అదే సమయంలో, తప్పుడు సమాచారం ఇస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నవంబర్ 6 నుంచి 20 రోజులపాటు అధికారులు సర్వే చేపట్టనున్నారు. తెలంగాణలో జరిగే ఈ సర్వే నేపథ్యంలో ఇప్పుడు పలువురు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను గుర్తుకు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే పేరుతో అన్ని వివరాలు సేకరించారు. ఈ సర్వే ఆధారంగానే ప్రజలకు ప్రయోజనాలు దక్కుతాయని ప్రకటించారు. దీంతో ఏకంగా పొరుగు రాష్ట్రాల్లో ఉద్యోగ, ఉపాధి సహా వివిధ కారణాల వల్ల నివసిస్తున్న ప్రజలు కూడా వచ్చి తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే, చిత్రంగా ఆ సర్వే వివరాలను పదవి దిగిపోయే వరకు కూడా.. కేసీఆర్ బయటపెట్టలేదు. సరికదా... వాటితో చేసిన ప్రజాపయోగ నిర్ణయాలు ఏంటో... ఎవరికీ అంతు చిక్కలేదు. ఇదే సమయంలో... కేసీఆర్ తన సొంత ఆలోచనల కోసం... ఈ వివరాలను వాడుకున్నారనే అపవాదును కూడా మూటగట్టుకునదారు.

ఇక తాజాగా తెలంగాణలో చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం లెక్క తేల్చేందుకు చేపడుతున్న సర్వే విషయంలోనూ... ప్రభుత్వం ఏం చేయనుందనే ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ విషయంలో.. రాజకీయ వేడి రాజుకుంది. సర్వేపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఎందుకు? అనే ప్రశ్నలు ఆయా పార్టీలు సంధిస్తున్నాయి. ఇదిలాఉంచితే, ఈ సర్వే విజయవంతం అయిన తర్వాత...ఈ ఫలితాలను ప్రజలకు అందించకుండా, విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా ఉంటే... కేసీఆర్‌తో రేవంత్ ను పోల్చడం ఖాయమని అంటున్నారు.

# జగన్ బాధ... వైసీపీ బాధ కాదా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు ఎన్నడూ లేని పెద్ద కష్టమే వచ్చిన విషయం తెలిసిందే. గతంలోనూ ఆయన కష్టాలు పడ్డారు. కానీ, అప్పట్లో ఆయన వెంట నిలబడేందుకు తల్లి-చెల్లి వచ్చారు. సీబీఐ అరెస్టు చేస్తున్న సమయంలో లేక్ వ్యూగెస్ట్ హౌస్ వద్ద రోడ్డుపై కూలబడి ఆర్తనాదాలు చేశారు. ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన జైల్లో ఉంటే.. పాదయాత్ర చేశారు. ప్రచారం చేసి.. పార్టీ కోసం శ్రమించారు. అయితే.. ఇప్పుడు దానికి మించిన కష్టం వచ్చింది. అదే.. జగన్ ఇప్పుడు ఆస్తుల వివాదాల్లో చిక్కుకున్నారు. ఆనాడు వెన్నంటి ఉన్న తల్లి-చెల్లి దూరమ య్యారు. మరోవైపు సర్కారు కూలిపోయి 11 స్థానాలకే పరిమితమయ్యారు. ఈ పరిణామం .. అసలు ప్రధాన ప్రతిపక్ష హోదానే ఆయనకు లేకుండా పోయింది. ఇది మరింత బాధ, ఆవేదన. కానీ, ఇప్పుడు తోడు ఎవరు? అంటే.. పార్టీ కేడర్, నాయకులు తప్ప.. వైసీపీ అధినేతకు మరో మార్గం, మరో మద్దతు కనిపించ డం లేదు. అంటే.. జగన్ బాధను ప్రపంచ బాధ చేయాల్సిన, దాని నుంచి సింపతీని పిండాల్సిన అవసరం వైసీపీ కేడర్ పైనే ఉంది. అయితే.. ఖచ్చితంగా ఇప్పుడే.. ఆ కేడర్ కూడా దూరంగా ఉంటుండడం గమనార్హం. పలు జిల్లాల్లో వైసీపీ నాయకులు మౌనంగా ఉన్నారు. పార్టీ కేడర్ దూరంగా ఉంది. దీనికి కారణం.. అధి కారంలో ఉన్నప్పుడు తమకుఏమీ చేయలేదన్న వాదన, తమకు కనీసం దర్శనం కూడా ఇవ్వలేదన్న బాధ రెండూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే క్లిష్ట సమయంలో జగన్‌కు దూరంగా జరుగుతున్నారు. మరీ ముఖ్యంగా మన అనుకున్న నాయకులు, ఏరికోరి పదవులు ఇచ్చిన నాయకులు కూడా ఇప్పుడు జగన్ బాధను తమ బాధగా చూడలేక పోతున్నారు. నోరు తెరిచి మాట్లాడేందుకు.. ప్రజల్లో చర్చ పెట్టేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. %--%తగిన శాస్తి జరిగింది!%--% అని పరోక్షంగా ఆనందిస్తున్నారో.. లేక, మన కెందుకులే అనుకున్నారో.. మొత్తానికి జగన్ బాధ.. వైసీపీ బాధ కాలేకపోవడం, దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లి సింపతీ రాళ్లను సంపాయించుకోవడంలో విఫలమయ్యారనేది పరిశీలకుల వాదన.

# గల్ఫ్ లో అమెరికా భారీ యుద్ధ విమానాలు.. ఇరాన్ గుండెల్లో రైళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్ పై అమెరికా అధ్యక్ష ఎన్నికల కంటే ముందే దాడి చేస్తామంటూ హెచ్చరించిన ఇరాన్ కు అమెరికా గట్టి సంకేతమే పంపింది. తమవ్యూహాత్మక బాంబర్లను పశ్చిమాసియాకు తరలించింది. ఇరాన్ దూకుడును ఏమాత్రం సహించమని తేల్చి చెప్పింది. బి-52 స్ట్రాటో ఫోర్ట్రెస్ .. అమెరికా కు చెందిన భారీ యుద్ధ విమానాలు ఇవి. వీటిని ఇరాన్ ను కట్టడి చేసేందుకు మోహరిస్తామని చెప్పిన 24 గంటల్లోనే అన్నంత పనీ చేసింది అగ్ర రాజ్యం. మినాటో ఎయిర్ బేస్ లోని 5వ బాంబ్ వింగ్ కు చెందిన బి-52 స్ట్రాటజిక్ బాంబర్లను తొలుత సెంట్రల్ కమాండ్ ఏరియాకు చేరవేసింది అమెరికా.


తర్వాత ఫైటర్ జెట్లు, ట్యాంకర్ ఎయిర్ క్రాఫ్ట్ లు, బాలిస్టిక్ మిసైల్స్‌నూ తరలించింది. ఇరాన్ ను ఎదుర్కొనేందుకు తాము ఈ విమానాలను మోహరిస్తామని అమెరికా శుక్రవారం హెచ్చరించింది. శనివారం అంటే 24 గంటల్లోనే బి-52 స్ట్రాటో ఫోర్ట్రెస్ లు గల్ఫ్ చేరుకోవడం గమనార్హం.

ఇరాన్ కానీ.. దాని మద్దతు ఉన్న సంస్థలు అమెరికా సైన్యం లేదా తమ దేశ ప్రయోజనాలను దెబ్బతీయాలని చూస్తే అడ్డుకుని తమవారిని కాపాడుకుంటామని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాయలం పెంటగాన్ ప్రతినిధి మేజర్ జనరల్ పాట్ రైడర్ స్పష్టం చేశారు.

**గట్టి సమాధానం ఇస్తాం..**

అమెరికా బాంబర్లను తరలిస్తున్న సంగతి తెలిసి ఇరాన్ మండిపడింది. అగ్ర రాజ్యానికి తాము గట్టి సమాధానం చెబుతామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఇలాగైతే తమ అణు విధానాన్ని పునః పరిశీలించాల్సి ఉంటుందని ఖమేనీ సలహాదారు కమాల్ ఖర్రాజ్ కూడా స్పష్టం చేశారు. ఒకవేళ తమపై దాడికి దిగితే అణు విధానంలో మార్పులు చేస్తామనేది దీని ఉద్దేశంగా తెలుస్తోంది. ఇటీవల ఉక్రెయిన్ డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు రష్యా సైతం ఇదే విధంగా అణు విధానంలో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ కమాండోలు రంగంలోకి అమెరికా బాంబర్ గల్ఫ్ కు వస్తుండగా.. ఇరాన్ హెచ్చరికల నడుమ ఇజ్రాయెల్ కమాండోలు రంగంలోకి దిగారు. లెబనాన్ లోని పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. లెబనాన్ తీరంలో ఓ హెజ్‌బొల్లా సీనియర్ ఆపరేటివ్ ను అదుపులోకి తీసుకొన్నారు. దీనిపై లెబనాన్ సైన్యం, ఐరాస శాంతి పరిరక్షక దళం దర్యాప్తు మొదలుపెట్టాయి.

# టెక్నాలజి : చాట్ జీపీటీతో సెర్చ్..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఓపెన్ ఏఐ సంస్థ.. చాట్ జీపీటీ హోమ్ పేజీలో కొత్తగా సెర్చ్ ఆప్షన్ ఫీచర్ కనిపించబోతోంది. అందులో క్రికెట్ స్కోర్, న్యూస్, స్టాక్స్ వంటి ఇన్ఫర్మేషన్‌ను పొందొచ్చు. చాట్ జీపీటీ. కామ్ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్ లోనూ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం చాట్‌జీపీటీ ప్లస్, టీమ్ యూజర్లు, సెర్చ్ జీపీటీ వెయిట్ లిస్ట్ యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. ఎంటర్ ప్రైజెస్, ఎడ్యుకేషనల్ యూజర్లు కొన్ని వారాల్లో ఈ సెర్చ్ ఆప్షన్‌ని వాడుకునే అవకాశం కల్పిస్తుంది. చాట్‌జీపీటీని ఫ్రీగా వాడేవాళ్లకు కూడా మరికొన్ని నెలల్లో ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తుందని కంపెనీ తెలిపింది. చాట్‌జీపీటీలో ఇప్పటివరకు ఏదైనా అడిగితే.. డేటాబేస్‌లో ఉండే ఇన్ఫర్మేషన్ మాత్రమే అందించేది. ఇకపై ఏవైనా ప్రశ్నలు అడిగితే.. వెబ్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని కూడా అందించనుంది. దాని తర్వాత అడగబోయే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. క్లైమేట్, స్టాక్స్, స్పోర్ట్స్, న్యూస్, మ్యాప్స్ కోసం ఓపెన్ ఏఐ కంపెనీ.. ఫైనాన్షియల్ టైమ్స్, టైమ్ మ్యాగజైన్, బిజినెస్ ఇన్‌సైడర్ వంటి కంపెనీలతో కలిసి పనిచేయనుంది.

## అత్తాపూర్‌లో ఈ రెస్టారెంట్‌కు వెళ్లకండి... కిచెన్‌లో బొద్దింకలు.. కుళ్లిపోయిన కూరగాయలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని హొటళ్లు, రెస్టారెంట్లలో రోజురోజుకు కల్తీ ఫుడ్ పెరుగుతోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిత్యం ఏదో ఒక చోట దాడులు చేసినా నిర్వాహకులు తీరు మారడం లేదు. కల్తీ పధార్థాలు ,పాడైన కూరగాయలు, కాలం చెల్లిన ఐటమ్స్ వాడి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. లేటెస్ట్ గా అత్తాపూర్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిర్వహించారు. కాలిఫోర్నియా బురిటో రెస్టారెంట్ లో కిచెన్ లో తనిఖీలు చేసిన అధికారులు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ లో బొద్దింకలు .. కుళ్లిపోయిన కాలీఫ్లవర్ ఉపయోగించి వంట చేస్తున్నట్లు గుర్తించారు. మజ్లిస్ కల్చర్ రెస్టారెంట్ లో గడువు ముగిసిన ఫ్రూట్ సిరప్, కేవ్రా వాటర్, ఫ్రూట్ క్రష్ వినియోగిస్తున్నారు. మెడికల్ ఫిట్ నెస్ సర్టిఫికెట్లు లేని ఫుడ్ హ్యాండ్లర్ లు వాడుతున్నారు. అలాగే సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు గుర్తించారు ఫుడ్ సేఫ్టీ అధికారులు.

## సుప్రీంకోర్టు తీర్పుతో మాలల్లో ఐకమత్యం వచ్చింది : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ ల రిజర్వేషన్ కు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపిన నేతలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుతో మాల కమ్యూనిటీ ప్రజల్లో ఐకమత్యం వచ్చిందనంటూ.. నాగర్ కర్నూలు సభలో చాలామంది పాల్గొన్నారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్ లో సభ పెట్టేందుకు కమిటి వేశామన్నారు. డిసెంబర్ 1 న హైదరాబాద్ లో మాలల మహాసభ ఉంటుందని... మన జాతి.. మన హక్కులను మనమే కాపాడుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇంట్లో కూర్చుంటే ఏమీ రాదు.. బస్తీ బస్తీకి తిరిగి.. ఎస్సీ వర్గీకరణ గురించి వివరించాలన్నారు. గతంలో మానాన్నగారు మీ వెంట ఉన్నారని.. ఇప్పుడు నేను ఉంటానన్నారు. మా నాన్న గారు చాలా సేవలు చేశారని. . మాది ప్రజలకు సేవ చేసే కుంటుంబం అని అన్నారు. జాగో మాల ద్వారా అందరిని చైతన్యపరచాలని.. మనమంతా కలిసి అన్ని రాజకీయ పార్టీలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వాలన్నారు. నాయకుల చేతిలో ఏమీ ఉండదని.. ప్రజల ఒత్తిడిమీదనే ఆధారపడి ఉంటుందని ... అందరూ బయటకు రావాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య మాట్లాడుతూ... మాలలందరూ ఐక్యంగా పోరాడాలంటూ.. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మన వెంట ఉంటారన్నారు, ఖబడ్దార్ మందకృష్ణ అంటూ.. మాలల సంక్షమం కోసం పోరాటం చేస్తామని చెన్నయ్య అన్నారు. మాలల హక్కులను కాపాడేందుకు కేంద్రప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు.

## తాను క్లాస్‌తో పాటు మాస్ సీఎం నని చెబుతున్నారా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** విజన్ ఉన్న ముఖ్యమంత్రిగా, రాష్ట్రానికి సీఈవోగా సీఎం చంద్రబాబు పేరు తెచ్చుకున్నారు. అయితే.. ఇది క్లాస్ జనాల దగ్గర బాగానే వర్కవుట్ అయింది కానీ, క్షేత్రస్థాయిలో పేదలకు కనెక్ట్ కాలేదు. దీనివల్లే వైసీపీ ఓటు బ్యాంకు పదిలంగా ఉందన్నది ఒక చర్చ. లేకపోతే.. ఇంత బలమైన పోటీలో కూడా వైసీపీ 37 శాతం పైగా ఓటు బ్యాంకు ఎలా సంపాయించుకుందన్నది ప్రధాన చర్చ. ఇదే ధైర్యం జగన్‌లోనూ కనిపి స్తోంది. పేదలకుచంద్రబాబు కనెక్ట్ కాలేరన్నది ఆయన భావన. ఈ నేపథ్యంలోనే జగన్ తరచుగా పేదల గురించి, పథకాల గురించే మాట్లాడుతూ.. వారిని తాను మరింత ఓన్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రహించారో ఏమో.. చంద్రబాబు ఇప్పుడు వ్యూహా త్మకంగా అడుగులు వేస్తున్నారు. తాను క్లాస్‌తో పాటు మాస్ సీఎంనని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. పేదల ఇళ్లకు వెళ్తున్నారు. వారితో కలిసి వారి మంచాలపైనే కూర్చుంటున్నారు. వారితో కలిసి టీ తాగుతున్నారు. వారి యోగ క్షేమాలు తెలుసుకుంటున్నారు. గత మూడు మాసాలుగా 1వ తేదీనాడు చంద్రబాబు చేస్తున్న పనులు పరిశీలిస్తే.. ఇదే కనిపిస్తుంది. జూలై 1న అమరావతిలోని అత్యంత పేదల ఇంటికి వెళ్లారు. పింఛన్లు అందించారు. వారితో కలిసి టీ తాగారు. ఆగస్టు 1న కర్నూలు జిల్లాకు వెళ్లారు. అక్కడ కూడా సేమ్ టు సేమ్ పనే చేశారు. సెప్టెంబరులో ప్రయాణా నికి వరదలు అడ్డు వచ్చాయి. దీంతో ఆగిపోయారు. అక్టోబరులో మళ్లీ సేమ్ టు సేమ్ అన్నట్టుగా పింఛన్ల పంపిణీకి శ్రీకాకుళం వెళ్లారు. పేదల ఇంటికి వెళ్లి వారితో కలిసి టీ తాగారు. ఇక, ఇప్పుడు కూడా శ్రీకాకుళం పర్యటనకు వెళ్లారు. స్వయంగా పేదల ఇంట్లో టీ కాచి.. వడగట్టి తానే సర్వ్ చేశారు. మొత్తంగా ఈ పరిణామాలను గమనిస్తే.. మాస్ లీడర్‌గా చంద్రబాబు తనను తాను ప్రొజెక్టు చేసుకునే ప్రయత్నం, వైసీపీకి మాత్రమే పరిమితం అనుకున్న పేదల ఓటు బ్యాంకును తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది. గతంలో జగన్ ఇలా చేయకపోవడం గమనార్హం. తాను పెట్టుకున్న సభ వద్దే వారిని పిలిచి మాట్లాడేవారు. కానీ, ఇప్పుడు చంద్రబాబు నేరుగా పేదల ఇంటికే వెళ్లిపోతున్నారు. ఇదీ.. ఇద్దరికీ తేడా. మరి ఈ ప్రయత్నం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

# కళ్లు చెమర్చాయి... కేకేఆర్ రిటెన్షన్ లిస్టులో పేరు లేకపోవడంపై స్టార్ క్రికెటర్ ఎమోషనల్

- కోల్‌కతా జట్టుతో భావోద్వేగ బంధం ఉందన్న వెంకటేశ్ అయ్యర్
- మెగా వేలంలో తిరిగి దక్కించుకుంటారనే ఆశాభావం వ్యక్తం చేసిన కేకేఆర్ ప్లేయర్
- జట్టు రిటెన్షన్ లిస్ట్ బాగుందని విశ్లేషణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2024 విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఇటీవల ప్రకటించిన రిటెన్షన్ లిస్టులో తన పేరు లేకపోవడంపై ఆ జట్టు స్టార్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ ఎమోషనల్ అయ్యాడు. రిటెయిన్ జాబితాలో పేరు లేకపోవడం తన కళ్లు చెమర్చేలా చేసిందని చెప్పాడు. 2021 నుంచి కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకే ఆడానని గుర్తుచేసుకున్నాడు. రిటెన్షన్‌లో తన పేరు లేకపోవడంతో కన్నీళ్లు వచ్చాయని వెంకటేశ్ అయ్యర్ భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు. కోల్‌కతా జట్టు ఒక పరిపూర్ణ కుటుంబం లాంటిదని, తాను కేవలం ఆటగాళ్ల గురించే కాదు మేనేజ్‌మెంట్, సిబ్బంది, తెరవెనుక ఉన్న యువ ఆటగాళ్ల గురించి చెబుతున్నానని అన్నాడు. ఈ అటాచ్‌మెంట్ వెనుక చాలా భావోద్వేగం దాగి ఉంటుందని పేర్కొన్నాడు. అందుకే రిటెన్షన్‌లో పేరు లేకపోవడం కొంచెం కళ్లు చెమర్చాయని వ్యాఖ్యానించాడు. ఈ మేరకు 'రెవ్‌స్పోర్ట్స్'తో వెంకటేశ్ అయ్యర్ మాట్లాడాడు.

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రిటెన్షన్ జాబితా బాగుందని అభిప్రాయపడ్డాడు. బౌలింగ్ విభాగంలో 14-16 ఓవర్లు, బ్యాటింగ్‌లో 5 స్థానాలు కవర్ అయ్యాయని విశ్లేషించాడు. రిటెయిన్ లిస్టులో ఉండాలని ఆశించానని చెప్పాడు. ఇక రిటెన్షన్‌లో పేరు లేకపోయినప్పటికీ వేలంలో తిరిగి కోల్‌కతా జట్టు తనను దక్కించుకుంటుందనే ఆశాభావాన్ని వెంకటేశ్ అయ్యర్ వ్యక్తం చేశాడు.

కేకేఆర్ తనను తొలిసారి దక్కించుకున్న వేలం సమయంలో లైవ్ స్ట్రీమింగ్ లేదని, అయితే ఈసారి వేలంలో తనను కోల్‌కతా దక్కించుకుంటుందా లేదా అనే ఉత్సుకతతో చిన్నపిల్లాడిలా కూర్చొని లైవ్ స్ట్రీమింగ్ చూస్తానని చెప్పాడు.కాగా గరిష్ఠంగా ఆరుగురు ప్లేయర్లను మాత్రమే అట్టిపెట్టుకునేందుకు అవకాశం ఉండడంతో... 2024 ఐపీఎల్ ట్రోఫీని సాధించిన జట్టులోని చాలామంది ఆటగాళ్లను కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రిలీజ్ చేసింది. విడుదల చేసిన ఆటగాళ్లలో ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్‌తో పాటు వెంకటేశ్ అయ్యర్ కూడా ఉన్నారు. ఇక రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, రమణ్ దీప్ సింగ్, సునీల్ నరైన్, ఆండ్రూ రస్సెల్, హర్షిత్ రాణాలను రిటెయిన్ చేసుకుంది.

# డబ్ల్యూటీసీ చార్ట్ లో కిందికి జారిన టీమిండియా

- న్యూజిలాండ్ చేతిలో చిత్తుగా ఓడిన టీమిండియా
- 0-3 తేడాతో టెస్టు సిరీస్ కోల్పోయిన రోహిత్ సేన
- డబ్ల్యూటీసీ స్టాండింగ్స్ లో రెండో స్థానం
- నెంబర్ వన్ స్థానానికి ఎగబాకిన ఆసీస్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో టెస్టు సిరీస్ ను 0-3తో కోల్పోయిన టీమిండియా వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో కిందికి జారింది. ముంబయి టెస్టులో కివీస్ చేతిలో 25 పరుగుల తేడాతో ఓటమి అనంతరం... టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి పడిపోయింది. టీమిండియా వైఫల్యంతో, ఆస్ట్రేలియా జట్టు నెంబర్ వన్ స్థానానికి ఎగబాకింది. న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ లో వరుస ఓటముల ఫలితంగా డబ్ల్యూటీసీలో టీమిండియా 58.33 పాయింట్ల పర్సెంటేజీతో నిలిచింది. అదే సమయంలో, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్న ఆసీస్ 62.5 పాయింట్ల పర్సెంటేజీతో కొనసాగుతోంది. ఇక, భారత్ ను భారతగడ్డపైనే వైట్ వాష్ చేసిన తొలి జట్టు చరిత్ర లిఖించిన న్యూజిలాండ్ జట్టు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో నాలుగోస్థానంలో ఉంది.

# ముంబై టెస్టులో ఓటమిపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందన ఇదే



- జట్టుగా రాణించడంలో విఫలమయ్యామన్న కెప్టెన్
- అంత తేలికగా జీర్ణించుకోలేని ఓటమి అని వ్యాఖ్య
- మరింత మెరుగ్గా ఆడాల్సిందన్న రోహిత్ శర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై టెస్టులో పర్యాటక న్యూజిలాండ్ చేతిలో భారత్ ఘోర పరాభవంపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. సమష్టిగా రాణించడంలో విఫలమయ్యామని అంగీకరించాడు. తన నాయకత్వం కూడా ఆశించిన స్థాయిలో లేదని అన్నాడు. తాను సామర్థ్యం మేరకు కెప్టెన్సీ నైపుణ్యాలు ప్రదర్శించలేకపోయానని తెలిపాడు. "టెస్టు సిరీస్ ఓడిపోవడం, టెస్ట్ మ్యాచ్ ఓడిపోవడం అంత సాధారణ విషయం కాదు. జట్టు అంత తేలికగా జీర్ణించుకోలేని ఓటమి ఇది. ఈ ఓటమి నాకు చాలా కాలం బాధ కలిగిస్తుంది. సమష్టిగా రాణించలేకపోవడమే ఈ ఓటములకు కారణం" అని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఈ మేరకు మ్యాచ్ అనంతరం మాట్లాడాడు."మేము మరోసారి మా అత్యుత్తమ ప్రదర్శన చేయలేదు. ఈ విషయాన్ని మేము అంగీకరించాలి. న్యూజిలాండ్ ప్లేయర్లు మా కంటే చాలా మెరుగ్గా ఆడారు. మేము చాలా తప్పులు చేశాం. బెంగళూరు, పుణే టెస్టుల్లో మొదటి ఇన్నింగ్స్‌లో తగిన స్కోర్లు చేయలేక వెనుకబడ్డాం. అయితే ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగుల ఆధిక్యాన్ని పొందాం. దీంతో ముందున్నామని అనుకున్నాం. లక్ష్యం కూడా సాధించగలిగేదే. కానీ మేము ఇంకా మెరుగ్గా ఆడాల్సింది" అని రోహిత్ అభిప్రాయపడ్డాడు. ఇక వ్యక్తిగత ప్రదర్శన, సిరీస్ అంతటా దూకుడుగా బ్యాటింగ్ చేయడంపై ప్రశ్నించగా... మ్యాచ్‌లు గెలవనప్పుడు ఇలాంటి ప్రదర్శనలు మంచిగా కనిపించవని వ్యాఖ్యానించాడు. "బోర్డ్‌పై పరుగులు ఉండాలని మీరు కోరుకుంటారు. నా మనసులో కూడా ఉండేది అదే. అనుకున్నది జరగకపోవడంతో మంచిగా అనిపించలేదు. బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు నా మనసులో కొన్ని ఆలోచనలు ఉంటాయి. కానీ ఈ సిరీస్‌లో అనుకున్నది జరగలేదు. అందుకు నాకు నిరాశగా ఉంది" అని చెప్పాడు.

ఇక మూడవ టెస్ట్‌లో కీలకమైన పరుగులు రాబట్టిన ఇద్దరు బ్యాటర్లు శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్‌లపై రోహిత్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇలాంటి పిచ్‌పై ఎలా బ్యాటింగ్ చేయాలో కుర్రాళ్లు చూపించారని మెచ్చుకున్నాడు.



అలయ ఎఫ్: బ్లాక్ ఎలిగాన్స్‌లో షోస్టాపర్!

# బ్రహ్మ రాక్షసుడిగా ప్రభాస్.. నిజమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పలు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. ఎప్పుడు వస్తాయో తెలియదు కానీ, ఆయన చేతిలో ఇప్పుడు ఐదు సినిమాలు ఉన్నాయి. ఈ క్రమంలో 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నట్లుగా ఇటీవల వార్తలు వచ్చాయి. తాజాగా వినిపిస్తున్న టాక్ ప్రకారం, ప్రభాస్ కు ప్రశాంత్ ఓ కథ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఇది గతంలో రణవీర్ సింగ్ తో చేయాలనున్న 'బ్రహ్మ రాక్షస' కథ అని అనుకుంటున్నారు.'హను-మాన్' బ్లాక్ బస్టర్ హిట్ అయిన తర్వాత, ప్రశాంత్ వర్మ బాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడానికి ప్రయత్నాలు చేశారు. హిందీ స్టార్ హీరో రణవీర్ సింగ్ కు తాను రాసుకున్న 'బ్రహ్మ రాక్షస' కథ చెప్పి మెప్పించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్ ను తెరకెక్కించాలని ప్లాన్ చేసారు. రణవీర్ తో ఫోటో షూట్ కూడా చేసినట్లు అప్పట్లో టాక్ వచ్చింది. అయితే ఏమైందో ఏమో కానీ, అధికారిక ప్రకటన రాకముందే ఈ ప్రాజెక్ట్ ఆగిపోయింది. క్రియేటివ్ డిఫరెన్సెస్ కారణంగానే పట్టాలెక్కలేదనే రూమర్లు కూడా వినిపించాయి. అయితే ప్రశాంత్ అదే స్టోరీని ప్రభాస్ తో చేస్తారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.'బ్రహ్మ రాక్షస' అనేది మైథలాజికల్ టచ్ ఉన్న పీరియాడికల్ ఫిల్మ్ అని టాక్ ఉంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగానే ఈ మూవీ ఉంటుందట. అంతేకాదు ఇందులో హీరో పాత్ర కాస్త గ్రే షేడ్స్‌తో ఉంటుందని అప్పట్లో అనుకున్నారు. ఎన్నాళ్ళ నుంచో నెగిటివ్ షేడ్స్ ఉండే క్యారక్టర్ ప్లే చెయ్యాలని చూస్తున్న ప్రభాస్.. ఇప్పుడు ప్రశాంత్ వర్మ చెప్పిన స్టోరీకి ఓకే చెప్పినట్లుగా ఫిలిం సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.కాకపోతే ప్రభాస్ - ప్రశాంత్ వర్మ కాంబినేషన్ లో ఇప్పుడప్పుడే సినిమా వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ప్రశాంత్ ప్రస్తుతం 'హనుమాన్' సీక్వెల్ గా 'జై హనుమాన్' అనే సినిమా చేస్తున్నారు. అలానే తన దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞను హీరోగా పరిచయం చేసే బాధ్యత తీసుకున్నారు. ఇవి కాకుండా ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో మరికొన్ని సినిమాలకు కథలు అందించడానికి రెడీ అయ్యారు.మరోవైపు మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్' సినిమాలో నటిస్తున్నారు ప్రభాస్. హను రాఘవపూడి చిత్రాన్ని ఇటీవలే సెట్స్ మీదకు తీసుకెళ్ళారు. సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో 'స్పిరిట్' మూవీని ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో మొదలుపెట్టాలని చూస్తున్నారు. ఇవి కాకుండా 'సలార్ 2', 'కల్కి 2' ప్రాజెక్ట్స్ డార్లింగ్ లైనప్ లో ఉన్నాయి. ఇలా ప్రభాస్ - ప్రశాంత్ కమిట్మెంట్స్ పూర్తవ్వడానికి చాలా టైమ్ పట్టొచ్చు. ఒకవేళ 'బ్రహ్మ రాక్షస్' వార్తలు నిజమే అయితే, ఇది పట్టాలెక్కడానికి రెండు మూడేళ్లు పట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

బికినీ సొబగుల్లో వేధికా స్టన్స్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com